
ప్రజాశక్తి
గురువారం 22 ఫిబ్రవరి 2024
5
పార్వతీపురం మన్యం



రెండు నెలలూ కొనసాగించాలి

ప్రజాశక్తి-సీతంపేట



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆదివాసీ బహుభాష, మాతృభాష వాలంటీర్లను మార్చి, ఏప్రిల్ నెలలు కూడా కొనసాగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మండలంలోని జోనగం పాఠశాల వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వీరికి తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, సర్పంచ్ సవర సాయికుమార్, బహు బాషా ఉపాధ్యాయులు సవర. శ్రీను మద్దతు తెలిపారు.



ఆదివాసీల ఆరోగ్యానికి నిర్లక్ష్యం చెద

- గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లోనే ఎఎన్ఎంలు
- గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 90శాతం మరణాలు
- సకాలంలో వైద్య సేవలందక ఇబ్బందులు
- ఎందుకీ వివక్షంటున్న గిరిజన సంఘాలు

ఒకే గొడుగు కింద పని చేసే వివిధ రకాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కో విధమైన సౌకర్యాలు ఉండడం పట్ల గిరిజనుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న గురుకుల పాఠశాలలు, ఏకలవ్య పాఠశాలల్లో మెరుగైన వసతి, భోజన సదుపాయాలు ఉంటాయి. అదే గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మాత్రం నాసిరకం సౌకర్యాలున్నాయి. వసతి, భోజన సౌకర్యాలలో తేడా ఉండొచ్చు. కానీ అక్కడా ఇక్కడా చదువుతున్నది ఆదివాసీ గిరిజన విద్యార్థులే. కానీ వారి ఆరోగ్య పరిరక్షణలో, వైద్య సేవలు అందించడంలో మాత్రం వివక్ష చూపడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి-సాలూరు

గిరిజన సంక్షేమ గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య సేవలు అందించడానికి ఎఎన్ఎంలను నియమించారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమై సకాలంలో వైద్య సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నారు. అదే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్య సమస్య వస్తే దిక్కూ దిమానా లేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడో, వార్డెనో అనారోగ్యానికి గురైన విద్యార్థులను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందేలా చూడాలి. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ఇంత తేడా కనబరచడం వివాదాస్పదమవుతోంది.

మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించలేదు. గత ప్రభుత్వం హయాంలో ఆదివాసీ ఆరోగ్యం అనే కార్యక్రమం కింద అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ ఆరోగ్య కార్యకర్తలను నియమించారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 55 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య కార్యకర్తల నియామకం చేపట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియామకానికి నీళ్లొదిలింది. ఇప్పుడున్న గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించారు. ఏకలవ్య పాఠశాలల్లో అయితే ఇద్దరు చొప్పున ఎఎన్ఎంలు పని చేస్తున్నారు. మూడు రకాల పాఠశాలల్లో చదువుతున్నది ఆదివాసీ గిరిజన విద్యార్థులే. వారి భోజనం, వసతి సౌకర్యాలల్లో స్పష్టమైన తేడా చూపిస్తున్న ప్రభుత్వం వారి ఆరోగ్య పరిరక్షణలోనూ వివక్ష చూపడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్రధానంగా మన్యం జిల్లాలో జరుగుతున్న విద్యార్థుల మరణాల్లో 90 శాతం పైగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న వారివే కావడం గమనార్హం. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారు. ఈ ఏడాదిలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో జరిగిన విద్యార్థుల మరణాల్లో ఎక్కువ మంది ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులే ఉన్నారు.

మరణాలను అడ్డుకోలేరా?

గతేడాదిలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్ర స్థాయిలో ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించిన జిల్లాగా ఆవిర్భవించింది. ఈ ఘనత వెనుక తమ కృషి, పట్టుదల ఉందని మన్యం జిల్లా అధికారులు గొప్పలు చెప్పుకున్నారు. ఇప్పుడు విద్యార్థుల మరణాల్లోనూ జిల్లా దూసుకుపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశా లల్లో మరణాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. చేతికంది వచ్చే పిల్లలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృత్యువాత పడుతుండడంతో వారి తల్లిదండ్రులు గర్భశోకానికి గురవుతున్నారు. విద్యార్థుల మరణాలు లేని మన్యం జిల్లాగా పేరు తేవడానికి కృషి చేయాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

ఎందుకీ వివక్ష?

మారుమూల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వం ఎందుకు ఇంత వివక్ష చూపిస్తున్నదనే ప్రశ్న తలెత్తుతోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యాలతో పాటు వైద్య సేవలు అందించడానికి సంబంధించిన పాఠశాల యాజమాన్యమే బాధ్యత వహించాలి. ఆ పాఠశాల హెచ్ఎం లేదా వార్డెన్ విద్యార్థులకు అనారోగ్య సమస్య తలెత్తితే ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆసుపత్రిలో చేర్పించాలి. వైద్య సేవలు అందేలా చూడాలి. ఒకవేళ అక్కడ ఆరోగ్యం కుదుట పడకపోతే ప్రాంతీయ ఆసుపత్రికో, జిల్లా ఆసుపత్రికో తీసుకెళ్ళాలి. ఈ విద్యార్థుల రవాణా ఖర్చులు, వైద్య సేవల ఖర్చులు సంబంధిత పాఠశాల యాజమాన్యమే భరించాలి. ఈ ఖర్చులు భరించేందుకు ప్రభుత్వం నుంచి ఏ విధమైన నిధులూ మంజూరు కావడం లేదు. పాఠశాలల్లో వసతిగృహాల్లో విద్యార్థులకు సరిపడా వంట మనుషులు లేరు. లేకపోతే యాజమాన్యమే బాధ్యత సొంత ఖర్చులతో వంటపని చేసేవారిని ఏర్పాటుచేసుకోవాలి. ఈ ఖర్చులన్నీ ఆశ్రమ పాఠశాల యాజమాన్య బాధ్యులే భరించాలి. పనిఒత్తిడితోపాటు ఖర్చులు తడిసిమోపెడు అవుతున్న తీరు కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు పాఠశాల బాధ్యులు సకాలంలో స్పందించకపోవడం కూడా జరుగుతోంది. అదే గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన భోజనం వసతి సౌకర్యాలతోపాటు వైద్య సేవలు అందించడానికి సిబ్బంది ఉన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే ఖర్చుల కోసం ప్రత్యేక నిధులు కూడా మంజూరవుతున్నాయి. ఎక్కువమంది విద్యార్థులు చదువుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. వివిధ అనారోగ్య కారణాలతో వరుసగా విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నా పాలకుల్లో గాని, మన్యం జిల్లా అధికారుల్లో చలనం లేదు. మరణాలకు ప్రధాన కారణం ఏమిటనే దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఏకలవ్య, గురుకుల పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించిన ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో ఎందుకు నియమించలేదని గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్నారని, వివిధ అనారోగ్య కారణాలతో మరణాలు అక్కడే సంభవిస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో ఆదివాసీ ఆరోగ్యం కింద ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని కోరారు.



వాలంటీర్లతో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ఎన్నికలకు సిద్ధంకండి


వాలంటీర్లకు డిప్యూటీ సిఎం రాజన్నదొర పిలుపు

ప్రజాశక్తి-మక్కువ

కొద్ది రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు వాలంటీర్లంతా సిద్ధంగా ఉండాలని, అలాగే ప్రజలను కూడా సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వాలంటీర్లకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వాలంటీర్లకు సేవా సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలు ప్రజలకు వైసిపి హయాంలో మేలు జరిగిందని తెలిపారు. అందుకే లబ్ధి పొందితేనే ఓటు వేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి గట్టిగా అడుగుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో వాలంటీర్లంతా సైనికుల్లా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. వాలంటీర్ల సేవలకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఎంత చెప్పుకున్నా తక్కువేనని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మండలంలో 346 మంది వాలంటీర్లకు సుమారు 56 లక్షలకు పైచిలుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌టిఆర్ పేరును చంద్రబాబు ఎన్నికల సమయంలో మాత్రమే వాడుకుని తరువాత పక్కన పడేస్తారని రాజన్నదొర విమర్శించారు. ఎన్‌టిఆర్ బొమ్మ పెట్టుకుని మాత్రమే పార్టీని నడపగలరని, ప్రజలకు ఏమి చేశారని చెప్పుకొని మాత్రం కాదని తెలిపారు. టిడిపి హయాంలో దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు. ఎమ్మెల్సీగా గుమ్మడి సంధ్యారాణి నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. అనంతరం వాలంటీర్లకు పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు రంగు నాయుడు, ఎంపిపి ఎం.పారమ్మ, ఎంపిడిఒ దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో గిరిజన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



మృతి చెందిన బిడ్డిక శృతి (ఫైల్)

ఏజెన్సీలో అనారోగ్యంతో విద్యార్థుల వరుస మరణాలు సంభవిస్తున్నాయి. తాజాగా మండలంలోని భద్రగిరి గురుకుల బాలికల (పిటిజి) పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని బిడ్డిక శృతి.. బుధవారం రాత్రి మృతి చెందింది. రెల్లిగూడ గ్రామానికి చెందిన శృతి విశాఖపట్నం కెజిహెచ్‌లో గత వారం రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించింది. పది రోజుల క్రితం జ్వరం రావడంతో శృతిని భద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు చేర్పించారు. అయితే రెండు రోజుల తర్వాత పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విజయనగరం ఆసుపత్రికి, ఆ తరువాత విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు తరలించారు. వారం రోజులపాటు ఈ విద్యార్థినికి వైద్య సేవలు అందించినప్పటికీ ఫలితం లేక బుధవారం సాయంత్రం మరణించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్ తెలిపారు.

బకాయి జీతాలివ్వాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

12 నెలలుగా బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేపట్టారు. ముందుగా స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ కేశవ నాయుడుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జె.గౌరి, టి.అశోక్, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మన్యం జిల్లాలో గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రతి నెలా జీతాలు చెల్లించడం లేదన్నారు. 2 నుండి 12 నెలల జీతాలు బకాయిలో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల కార్మికుల కుటుంబాలు పస్తులతో గడుపుతున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే స్పందించి బకాయి జీతాలు చెల్లించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిఒ 68 జారీ చేసి 3 ఏళ్లు గడుస్తున్నా దాని ప్రకారం జీతాలు ఎక్కడా అమలు చేయడం లేదని వాపోయారు. గ్రీన్ అంబాసిడర్లను పంచాయతీలకు అప్పజెపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా, పంచాయతీల నుండి జీతాలు చెల్లించలేమని సర్పంచులు చెబుతున్నారని తెలిపారు. రూ.వెయ్యికి, రూ.1500కి పనిచేయాలని, లేకుంటే మానేయండని కొంతమంది సర్పంచులు చెబుతున్నారని, ఈ వైఖరి సరైనది కాదని అన్నారు. 680 జిఒ ప్రకారం జీతాలు చెల్లించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. నెలకు రూ.10 వేల జీతం ఇవ్వాలని, గ్రీన్ అంబాసిడర్లకు మాస్కులు, శానిటేజర్, యూనిఫాం, గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రిక్షాల రిపేర్లు చేయించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, గ్రీన్ అంబాసిడర్లు హెచ్. రాజేంద్ర, పి. కూర్మయ్య, ఎం.పైడయ్య, ఎం.చంటి, జి.రాము, పి.తిరుపతిరావు, ఎం.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పనులు పూర్తి

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



క్రీడాకారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో ఎన్నికల పనులు పూర్తి చేశామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీలతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన పనులు, శిక్షణ కార్యక్రమాలు సజావుగా జరిగాయన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఉన్న పోలింగ్ కేంద్రాలలో అదనంగా సహాయక కేంద్రం ఏర్పాటు, పోలింగ్ కేంద్రం పేరు మార్పు, లొకేషన్ మార్పుపై ప్రధాన ఎన్నికల అధికారి ప్రతిపాదనలు కోరారని తెలిపారు. జిల్లాలో జనవరి 13వ తేదీ నుండి ఇప్పటి వరకు 717 మందిని ఓటర్లుగా చేర్చామని తెలిపారు. 129 ఓట్లను తొలగించామని, 1091 మంది వివరాలు చేర్పులు, మార్పులు జరిగాయని వివరించారు.

ఈ సమావేశంలో డిఆర్ఒ జి.కేశవనాయుడు, టిడిపి ప్రతినిధి జి.వెంకటనాయుడు, వైసిపి ప్రతినిధి సిహెచ్ సంతోష్, సిపిఎం ప్రతినిధి పి.రాజశేఖర్, జనసేన ప్రతినిధి పైలా శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన పురుషుల జట్టు క్రీడాకారులను కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం తన ఛాంబర్ లో అభినందించారు. అనంతరం విజేతలకు కప్‌తోపాటు రూ.3 లక్షల నగదు బహుమతి చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్.వెంకటేశ్వర రావు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డిటి గాంధీ, శిక్షకులు తిరుపతి రావు, వైకుంఠ రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిసిసి ఎమ్‌డి సురేష్ కుమార్

పివిటిజిల బలోపేతానికి కృషి

జిసిసి ఎమ్‌డి సురేష్ కుమార్

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పివిటిజిల బలోపేతానికి కృషి చేస్తున్నామని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం సీతంపేట జిసిసి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పులిగుమ్మిలో విడివికెను సందర్శించారు. కొండచీపుర్ల యూనిటును పరిశీలించారు. భామిని మండలంలో మనముకొండలో ఉన్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ద్వారా నిర్వహిస్తున్న పసుపు యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం గిరిజన సహకార సంస్థ ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎం జి.సంధ్యారాణి, ఎపిఒ రోషిరెడ్డి, డిపిఎం రమణ, పాతపట్నం, సీతంపేట బ్రాంచ్ మేనేజర్లు జి.నరసింహులు, దాసరి కృష్ణ, ఎపిఎం విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ధర్నా

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్




ధర్నా చేస్తున్న నిర్వాసిత గిరిజనులు

కురుపాం మండలం టేకరకండి వద్ద చేపడుతున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని గిరిజనులు వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ కురుపాం మండలం టేకరుకండి, జియ్యమ్మవలస మండలం చంద్రశేఖర రాజపురం గిరిజనులు సాగు చేస్తున్న భూమిలో పోలీసులను పెట్టి దౌర్జన్యంగా ఇంజినీరింగ్ కాలేజీ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఆ సందర్భంలో గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తే సర్వే రిపోర్టు ఇచ్చారని, ఆ సర్వే ఆధారంగా హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామని తెలిపారు. గిరిజనుల పంటలకు రక్షణ కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్థానిక అధికారులు పోలీసులతో జులుం చేయించి కొంత భూమిలో దౌర్జన్యంగా కాలేజీ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాం వచ్చిన సందర్భంగా గిరిజన ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని దరఖాస్తు ఇస్తే, తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కానీ ఇంతవరకు ఎటువంటి న్యాయమూ జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేస్తున్న భూమికి నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి భూతాలు మోహన్ రావు, పి.రాము, సీతారాం, గిరిజనులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు భద్రం

సివిల్ సప్లై జోనల్ మేనేజర్ సుబ్బరాజు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



రికార్డులను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ సుబ్బరాజు

గోదాములలో సరుకులను తడి లేని ప్రదేశాల్లో నిల్వ చేస్తే సరుకులు పాడవకుండా భద్రంగా ఉంటాయని సివిల్ సప్లై సంస్థ విశాఖ జోనల్ మేనేజర్ ఎన్ .సుబ్బరాజు తెలిపారు. బుధ వారం గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ గోదాములను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాములకు ముందు వచ్చిన సరుకులను ముందుగా పంపించాలని, తరువాత వచ్చిన సరుకులను దశలవారీగా డిపోలకు పంపించాలని సూచించారు. సరుకులను సకాలంలో డిపోలకు సరఫరా చేయాలని, ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన గోదాంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఎల్ఎస్ గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డిఎంఒ జగన్‌మోహనరావు

పిహెచ్‌సిలో డిఎంఒ తనిఖీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బందలుప్పి పిహెచ్‌సిని మంగళవారం రాత్రి డిఎంఒ బి.జగన్‌మోహనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్యూటీ షిఫ్ట్ ప్రకారం ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. రాత్రి సమయాల్లో ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు ఆసుపత్రికి వస్తున్నారని సిబ్బందిని అడిగి రికార్డులో తనిఖీ చేశారు. అక్కడ పవర్ బ్యాకప్, బ్యాటరీ పనితీరును గమనించారు. వార్డు, ప్రసవగది పరిశీలించారు. తాగునీటి లభ్యతను పరిశీలించారు. అదే సమయంలో అక్కడకు చికిత్సకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆయన వెంట సిబ్బంది దుర్గాప్రసాద్ ఉన్నారు.



మాట్లాడుతున్న డిడి దొర

ఘనంగా ఒకేషనల్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -సీతంపేట

అల్లూరి సీతారామరాజు ఒకేషనల్ జూనియర్ కళాశాల 18వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిడి అన్నదొర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. గుడిలోవ ఉపాధ్యక్షులు నారాయణస్వామి, సావిత్రి భారతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌పి పెంటయ్య, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి జి.శ్రీహరిరావు

వేతనదారుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి -వీరఘట్టం

ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచాలని ఎపిడి జి.శ్రీహరిరావు క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో 5,200 మంది వేతనదారులు పనిలో పాల్గొంటున్నారని, మార్చి నాటికి 6 వేల మంది ఉపాధి పనుల్లో పాల్గొనేలా బాధ్యత వహించాలన్నారు. సమయానికి పనికి హాజరయ్యేలా వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎస్.సాల్మన్‌రాజు, ఎపిఒ జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని ఎం.రాజపురం గ్రామంలో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సీతంపేట మండలం గుజ్జి గ్రామానికి చెందిన 60 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.

26న వేలం

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఆటో, పల్సర్ బైకుకు ఈ నెల 26వ తేదీన వేలం వేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జగదీష్ నాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు హాజరు కావాలని కోరారు.

నేరాలు ఘోరాలు

పేలిన గ్యాస్ సిలిండర్

- సుమారు పది లక్షలు ఆస్తి నష్టం
- దల్లి పేటలో నీలగిరి తోట దగ్ధం

ప్రజాశక్తి -భోగాపురం

భోగాపురంలో ఓ ఇంట్లో బుధవారం అకస్మాతుగా గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీంతో సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన శిరుగుడి అప్పలరాజు ఇంట్లో వంటపాకలో మొదట మంటలు చెలరేగాయి. అక్కడి నుంచి ఇంట్లోకి వెళ్లడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో పక్కనున్న నూర్చిన ధాన్యం దిబ్బ, పశువుల పాకతో పాటు భూములకు సంబంధించిన విలువైన దస్తావేజులు, చదువుకున్న సర్టిఫికెట్లు, కొంత నగదు, బంగారం ఈ ప్రమాదంలో కాలిపోయాయి. పక్కనే ఉన్న మరో ఇంటికి అంటుకోవడంతో వారికి సంబంధించిన వస్తువులన్నీ కాలిపోయాయి. అప్పటికే స్థానికులు చేరుకొని మంటలు ఆరిపే ప్రయత్నం చేసినప్పటికీ గాలులు వీస్తుండడంతో జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు మేరకు రెవిన్యూ అధికారులు ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు. జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు బాధితులను పరామర్శించారు.

మాతుమూరులో నగలు చోరీ

ప్రజాశక్తి -పాచిపెంట

మండలంలోని మాతుమూరు గ్రామంలో పట్టపగలే బంగారు నగలు చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పి.నారాయణ రావు కథనం ప్రకారం.. మాతుమూరు గ్రామానికి చెందిన ముఖి సరస్వతి మంగళవారం ఉదయం ఉపాధి పనులకు వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చి తలుపులు తెరిచారు. పెరటి తలుపులు పగల కొట్టి ఉన్నాయి. పడకగది తలుపులు కూడా పగలకొట్టి బీరువాలోని 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఆమె ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించినట్లు ఎస్ఐ తెలిపారు.

మాతృభాషను మరవకూడదు



గుమ్మలక్ష్మీపురం.. మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీవరం



సాలూరు.. మాట్లాడుతున్న ఎస్‌వివి పాఠశాల కరస్పాండెంట్ సాయిశ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రపంచంలో ఎన్ని భాషలున్నా మాతృభాషను మరువ కూడదని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృభాష సౌందర్యం ఇతర భాషలలో లేదని చెప్పారు. మాతృభాషను గౌరవించి ఆ భాషలోనే సంభాషించాలని విద్యార్థులను కోరారు. వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య, అధ్యాపకులు బి.త్రినాథ్, కల్పన, తులసి పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు

మండలంలోని దిగువ మండ ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు పద్య పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పాలక దేవానంద్ మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు. మాతృభాష తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలోని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల లో బుధవారం మాతృభాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పద్య పఠనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ కోడూరు సాయి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషలో చదువుకున్న వారే దేశంలో గొప్ప గొప్ప విజయాలు సాధించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సవరభాషలో ప్రాథమిక విద్య బోధించాలి

గుమ్మలక్ష్మీపురం : సవరభాషలోనే ఆదివాసీ విద్యార్థులకు ప్రాథమిక విద్య బోధించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు కోరారు. ప్రపంచ మాతృభాష దినోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక దశలో ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలు గిరిజనుల విద్యార్థులకు కొంత అర్థం కావడం లేదన్నారు. అందుకే సవరభాషలో విద్యాబోధన చేస్తే ఆదివాసీ ప్రాంతాల్లో నిరక్షరాస్యత తగ్గుతుందన్నారు.





సీతానగరం, గరుగుబిల్లిలో వాలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, సర్పంచ్ శిరీష

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం చిన్నబొండపల్లి గ్రామంలో నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు సంక్షేమ పథకాలు వందశాతం పేద ప్రజలకు విజయవంతంగా అందుతున్నాయంటే అది వాలంటీర్ల వల్లనేనన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా సేవావజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లను ఘనంగా సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అఖిబ్ జావేద్, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, సర్పంచ్ గండి శంకరరావు, వైస్ ఎంపిపిలు బంకురు రవికుమార్, సిద్ధ జగన్నాథరావు, నాయకులు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంటిపేట గ్రామంలో బుధవారం 11 సచివాలయాలకు సంబంధించి గ్రామ వాలంటీర్లను ఎమ్మెల్యే అలజంగి జోగారావు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. అన్ని సందర్భాలలోనూ వాలంటీర్లు సేవలందించి, ప్రతిభను కనబరిచారని తెలిపారు. అనంతరం 175 మంది వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎంపిపి రవణమ్మ శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి బాబ్జీ, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, ఎంపిటిసి సేనపతి నిర్మల, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చనపతి తిరుపతిరావు, మాజీ జెడ్‌పిటిసి అంబటి కృష్ణంనాయుడు, మాజీ సర్పంచ్ సిరికి మహేష్, వైస్ ఎంపిపి పి.సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టి రాజు, సర్పంచులు బి.ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని నాగూరు సచివాలయం పరిధిలో నాగూరు, చిలకాం గ్రామాల్లో సేవామిత్రులుగా ప్రభుత్వం గుర్తించిన గ్రామ వాలంటీర్లను బుధవారం సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, కార్యదర్శి ఎస్.సంధ్య ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ చంద్రశేఖరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి కూర్మినాయుడు, వైసిపి నాయకులు బొత్స అప్పలనాయుడు, అక్కేన వెంకట నాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు ,తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను మోసగించిన వారిపై
చర్యలు తీసుకోవాలని దీక్షలు

ప్రజాశక్తి -సాలూరు

గిరిజనులను మోసం చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. ఈ శిబిరాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుతోపాటు ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంతల సుందర్రావు, గేమ్మెల జానకిరావు మాట్లాడుతూ మండలంలో జిల్లేడువలస, బొర్రపనుకువలస గిరిజనులకు ఇచ్చిన హామీని అమలు చేయకుండా గిరిజనుల మధ్య తగాదాలు పెట్టిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ, విఆర్ఒ కృష్ణమూర్తిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్‌చేశారు. మండలంలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సర్వే చేసి, పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, నాయకులు కోనేటి చినబాబు, వంతల లక్ష్మయ్య, చుక్క కొత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షలను ప్రారంభిస్తున్న వ్యకాస నాయకులు మర్రి శ్రీనివాసరావు

వైసిపి హయాంలో పెరిగిన దౌర్జన్యాలు



మక్కువ.. మాట్లాడుతున్న టిడిపి నాయకురాలు సంధ్యారాణి

ప్రజాశక్తి -మక్కువ

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు, దౌర్జన్యాలు ఎక్కువైపోయాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి ఆందోళన వ్యక్తంచేశారు బుధవారం పత్రికలపై దాడులకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తూ సిఎం జగన్మోహన్ రెడ్డి కనుసైగల్లో కొన్ని మూకలు దాడులకు తెగబడుతున్నాయని విమర్శించారు ఏకంగా సిఎం హోదాలో ఉండే వ్యక్తి బహిరంగ సభల్లో మీడియాపై విరుచుకుపడడమనే వింత పోకడ రాష్ట్రంలో రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం మీడియా కుటుంబమంతా ఏకమై దాడులను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఎరసామంతవలస ఆశ్రమ పాఠశాలను టిడిపి నాయకులు సందర్శించారు. హాస్టల్లో పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సంధ్యారాణి డిమాండ్ చేశారు. గిరిజన చిన్నారుల మరణాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకనీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. వారంలో రెండుసార్లు వైద్యుల పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని, దీనిపై జిల్లా కలెక్టరుకు వినతి అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గుల్ల వేణుగోపాలరావు నాయుడు, మావుడి ప్రసాద్ నాయుడు, సిహెచ్ తవిటి నాయుడు, మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమం రెండు కలగలిపి అందజేయాలంటే మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి అన్నారు. మండలంలో పురోహితునివలస, వల్లాపురం గ్రామాలలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో అంశాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి సాలూరు, మక్కువ మండలాల అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాల్‌నాయుడు, అక్యాన తిరుపతిరావు, అప్పికొండ రమాదేవి, యుగంధర్, తురాయిల సత్యం, రామకృష్ణ, వెంకటరమణ, భూస తౌడు, డొంక అన్నపూర్ణ, తాడుతూరి తిరుపతిరావు, మద్దిల కృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయం చాలా కీలకం

ప్రజాశక్తి -పార్వతీపురం



మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

ఎన్నికల నిర్వహణలో ఎన్నికల వ్యయం చాలా కీలకమని, పర్యవేక్షణ పకడ్బందీగా చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి ఒత్తిళ్లకు లోను కాకుండా, మంచి పనితీరు ఉండేలా పనిచేయాలని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి ఎన్నికల ముందు కనీసం మూడు సార్లు శిక్షణ ఇస్తామని చెప్పారు. వ్యయ పర్యవేక్షణ బృందాల కోసం మరో రెండు శిక్షణ సెషన్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఎన్నికల విధులలో అనుమానాలు శిక్షణ సమయంలోనే పూర్తిగా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సహాయ వ్యయ పరిశీలకులుగా పనిచేసిన బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ డివిజన్, డివిజనల్ అకౌంటెంట్స్ ఆఫీసర్ బి.సుందర సురేష్ మాస్టర్ ట్రైనర్‌గా శిక్షణ అందించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సహాయ వ్యయ పరిశీలకులు, వారి సహాయకులు, అకౌంటింగ్ బృందాల సభ్యులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి -కొమరాడ



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ రాణి

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని, వారికి రుచికరమైన ఆహారం అందించాలని ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి అన్నారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గంగరేవలసలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యార్థులకు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధనలో అందించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టంచేశారు. అంగన్వాడీ కేంద్రాలు తెరిచే సమయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆమెతోపాటు సిడిపిఒ సుగుణ, సూపర్వైజర్ శారద, అంగన్వాడి సిబ్బంది ఉన్నారు.

పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి -గరుగుబిల్లి



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మండల పరిధిలోని నాగూరు గ్రామానికి చెందిన దళితులకు గతంలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా మంజూరైన భూములకు సంబంధించి బుధవారం శాశ్వత హక్కు పత్రాలను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఇప్పటికే రైతులు సాగు చేసుకున్న భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ పట్టాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రైతుల్లో ఆనందానికి అవధులు లేవన్నారు. నాగూరు గ్రామానికి చెందిన దళిత రైతులు కారు రాముడమ్మ, కొప్పర పారమ్మ, మండంగి కౌసల్య, రెడ్డి సాయిలకు దాదాపు ఏడున్నర ఎకరాల భూములకు సంబంధించి శాశ్వత హక్కు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, శ్రీచంద్రశేఖర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి కూర్మినాయుడు, వైసిపి నాయకులు బొత్స అప్పలనాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకటనాయుడు, మిరియాల సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

గిరిజనుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -కొమరాడ

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలం మసిమండ పంచాయతీ జాగూరు గ్రామంలో సుమారు 25 మంది గిరిజనులు పోడు భూములు సాగు చేస్తున్నా, వారికి పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. దీంతో రైతు భరోసా గాని, రుణాలు గాని రావడం లేదని చెప్పారు. రీసర్వే చేసి వారు సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వాలని కోరారు. చోల్లపదం గ్రామానికి చెందిన తీగి రెడ్డి సూర్యనారాయణ ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించారని ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో తీగిరెడ్డి సూర్యనారాయణ, లక్ష్మణ, రాముడు, పెంటయ్య పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో గూంజ్ సంస్థ సహకారంతో మండలంలోని నేరేడువలస, తెన్నుఖర్జ, చెరువు కొమ్మవలస గ్రామాలకు చెందిన 160 గిరిజన కుటుంబాలకు బుధవారం నిత్యావసర కిట్లు అందజేశారు. గూంజ్ సంస్థ ప్రతినిధి తిరుపతి మాట్లాడుతూ దీనికి ప్రతిఫలంగా సొంత గ్రామాల్లో వీధి కాలువలు, శ్మశాన వాటికకు వెళ్లే రహదారి వంటివి శ్రమదానం ద్వారా ప్రజలు బాగు చేసుకున్నారని తెలిపారు. తమ పనులు తాము చేసుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే ఉద్దేశంతో వారిని ప్రోత్సహించేందుకు చిన్న ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరి కొన్ని గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఎండబ్ల్యూఎస్ సంస్థ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.



అందజేసిన నిత్యావసర కిట్లతో గిరిజనులు